సృజనాత్మకతకు వేదికలు..
విజ్ఞాన శిబిరాలు

- జ్ఞాన సముపార్జనలో బాలబాలికలు
- చదువుతో పాటు పలు నైపుణ్యాల్లో శిక్షణ
- శిక్షణలకు కేంద్రాలుగా గ్రంథాలయాలు

గడివేముల: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. వారిలో సృజనాత్మకతను పెంపొందించేలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు గ్రంథాలయాలను వేదికగా మార్చింది. ఆయా గ్రంథాలయాల్లో చిన్నారులకు రోజూ ఇంగ్లిష్‌లో సంభాషణ, చిత్రలేఖనం, రంగులు వేయడం, కాగితంతో కళారూపాలు తయారు చేయడం, సంగీతం, నృత్యం, బొమ్మల తయారీ, నటనతో పాటు, యోగా, క్యారమ్స్, చెస్ వంటి ఏకాగ్రతను పెంపొందించే క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. అలాగే పఠనంపై ఆసక్తి పెంపొందించేలా పుస్తక పఠనం చేయిస్తున్నారు. బాలల్లో పఠనాసక్తి పెంచేందుకు, వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో జూన్ 6 వరకు వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపరంగా, వారిలో సృజనాత్మకత వెలికి తీసేందుకు గ్రంథాలయాలు వేదికలుగా మారాయి. సృజనాత్మకత పెంచేందుకు.. వారిలో నైపుణ్యాలకు పదును పెట్టేందుకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంగ్ల భాషలో సంభాషణ, చిత్రలేఖనం, రంగులు వేయడం, కాగితంతో కళారూపాలు తయారు చేయడం, సంగీతం, నృత్యం, బొమ్మల తయారీ, నటనలో శిక్షణ ఉంటుంది. క్యారమ్స్, చెస్ ఆటలు ఆడిస్తారు. పిల్లలను సెల్‌ఫోన్ దృష్టిని మళ్లించి వారి మానసిక స్థితి నుంచి కాపాడేందుకు వేసవి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అదే విధంగా అతిథుల ప్రసంగాలను నిర్వహిస్తారు.


చదరంగం ఆడుతున్న విద్యార్థులు

మూడు ఉద్దేశాలు

ఈ శిబిరాల ద్వారా ప్రధానంగా మూడు ఉద్దేశాలను ఎంచుకున్నారు. బాలలు వేసవి సెలవుల్లో లభించే విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. చదవడాన్ని వారు ఒక మంచి అలవాటుగా పెంచుకోవాలి. క్రమం తప్పక గ్రంథాలయాలకు వచ్చే విధంగా వారిలో ఆసక్తి కలిగించాలి. బాలల సాహిత్యానికి చెందిన పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయాలి.

కాలనిర్ణయ పట్టిక

ఇందుకు అనుగుణంగా రోజూ గ్రంథాలయాల్లో బాలలకు ఉదయం కథలు వినిపిస్తారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయంలో ఉండే పుస్తకాల పఠనం జరుగుతుంది. 20నిమిషాల పాటు పుస్తక సమీక్ష చేస్తారు. పదిన్నర నుంచి 11 గంటల వరకు వారికి కథలు వినిపించటంతో పాటు..పిల్లలతో కథలు చెప్పిస్తారు.

నీతి కథలు చెబుతున్నారు



ఇక్కడ నీతి కథలు చెబుతున్నారు. మంచి మంచి కథల పుస్తకాలు చదివిస్తున్నారు. శిక్షణ తరగతులు ఆసక్తికరంగా ఉన్నాయి. నాతో మాట్లాడిస్తున్నారు. అందువల్ల స్టేజ్ ఫియర్ కూడా పోతుంది. ఈ వేసవి తరగతులను బాగా సద్వినియోగం చేసుకుంటా.

– రుతిక్, తొమ్మిదో తరగతి విద్యార్థి, గడివేముల

పుస్తకాలపై మక్కువ పెంచుకోండి

ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలతో బాలబాలికలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెరుగుతుంది. చదువుతో పాటు ఇతర నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నందు వల్ల సృజనాత్మకతను వెలికితీయవచ్చు. బాల్యం నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవటం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది. శిక్షణా శిబిరాల్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటేశ్వరరెడ్డి, గ్రంథాలయాధికారి, గడివేముల

క్లుప్తంగా

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం


సి.బెళగల్: మండలంలోని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పండ్ల తోటల సాగుపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించాలని ఈసీ రంగస్వామిగౌడ్ ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల తోటల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి వారు తోటల సాగుకు ముందుకు వచ్చేలా కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఐదెకరాల పొలం ఉన్న రైతులు 18 రకాల పండ్ల తోటల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పొలాల్లో నీటి కుంటలు, ఇళ్ల ముందు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు టీఏలు, ఎఫ్ఏలు అవగాహన కల్పించాలని ఆదేశించారు. టీఏలు మురళి, రామ్‌శంకర్, రాజశేఖర్, ఉమ తదితరులు ఉన్నారు.

అనుమతులున్న విత్తనాలనే విక్రయించాలి


విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: దుకాణదారులు వ్యవసాయ శాఖ అనుమతి కలిగిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని విత్తన దుకాణాలను ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేసి విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న పత్తి, కూరగాయల విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ విక్రయించరాదని, దుకాణంలో మొలక శాతాన్ని పరీక్షించిన తర్వాతే రైతులకు విక్రయించాలని సూచించారు. విత్తనాలు విక్రయించే సమయంలో తప్పనిసరిగా రసీదులివ్వాలని, రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఇవ్వాలని, ప్రతిరోజు సరుకు ఎంత ఉన్నదో స్టాక్ బోర్డులో కనబర్చాలని దుకాణదారులను ఆదేశించారు.

నేటి నుంచి చర్చి ప్రతిష్ఠోత్సవాలు


కొత్తకోటలో క్రీస్తు సంఘం నూతన చర్చి

సి.బెళగల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో గురువారం నుంచి శనివారం వరకు నూతన చర్చి ప్రతిష్ఠోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామ సంఘ పెద్దలు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మితమైన క్రీస్తు సంఘం చర్చి ప్రారంభోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందని పెద్దలు వెల్లడించారు. ఉత్సవాలు జరిగే మూడు రోజుల పాటు చర్చి సంఘం ఆధ్వర్యంలో భోజన వసతిని కల్పించడం జరిగిందని, ప్రజలందరూ చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొనాలని కోరారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

పత్తికొండ రూరల్ : పత్తికొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టణ సమీపంలోని నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. మధు అనే వ్యక్తి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది రాజేష్, తేజ్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పాణ్యం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఎస్‌కేలు, ఎస్‌హెచ్‌జీ మహిళలకు 'కిశోర వికాసం 2.0 అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న దురాచారాల గురించి వివరించారు. వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన అంశాలను తెలియజేశారు. 11 నుంచి 19 ఏళ్ల బాలికలతో కమిటీని ఏర్పాటు చేసి నెలకు 3 సమావేశాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం కిశోర్ బాలిక కమిటీలు, వాటి రక్షణకు, ప్రభుత్వ నిబంధనలు తదితర వాటిపై రూపొందించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ అవుట్‌రీచ్ వర్కర్ సునంద, సోషల్ వర్కర్ ఓబులమ్మ పాల్గొన్నారు.


బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

మున్సిపల్ రెవెన్యూ ఆదాయం రూ.23.66 కోట్లు

- ముగిసిన పన్ను రాయితీ గడువు

కర్నూలు (టౌన్): ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీ గడువు బుధవారం ముగిసింది. 2026–2027 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం పన్ను రాయితీ అవకాశం కల్పించింది. ఈ నెలలో ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ, ముందస్తు చెల్లింపుదారులకు 5 శాతం డిస్కౌంట్ అవకాశాలు కల్పించడంతో పలువురు పన్నుదారులు తమ ఇంటి పన్నులు చెల్లించారు. ఈ నెలలో రూ.23.66 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ వెల్లడించారు. మొండి బకాయిలకు సంబంధించి మార్కెట్ యార్డు సిబ్బంది రూ.29.12 లక్షల చెక్కు అందజేశారు. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ జునీద్ పాల్గొన్నారు.


అదనపు కమిషనర్‌కు చెక్కును అందజేస్తున్న మార్కెట్ యార్డు సిబ్బంది

శ్రీశ్రీ సాహిత్యం అనన్య సామాన్యం


శ్రీశ్రీ చిత్రపటానికి పూల మాల వేస్తున్న ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి


శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు, కళాకారులు

కర్నూలు కల్చరల్: శ్రీశ్రీ సాహిత్యం అనన్య సామాన్యమని, నిత్య నూతనమని పలువురు సాహితీవేత్తలు, కవులు కొనియాడారు. టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం శ్రీశ్రీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సాహిత్యంలో శ్రీశ్రీ విప్లవ కవిగా, సినీ రచయితగా సమాజాన్ని చైతన్య పరిచేలా ఎన్నో రచనలు చేశారన్నారు. భూస్వామ్య, పెట్టుబడిదారి విధానం పోవాలని, శ్రామిక, కార్మిక, కర్షక జీవన విధానం బలోపేతం చేసేందుకు కవిత్వం రాశారన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు బాలవెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, కరీముల్లా, శ్రీనివాసరెడ్డి, చంద్రకంటి మద్దయ్య, సాహితీవేత్తలు కెంగార మోహన్, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

– దేవీ ప్రసన్న సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మహా కవి శ్రీశ్రీ జయంతిని బుధవారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ బి.వి.స్వరూప్ సిన్హా . తెలుగు కల్లం సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు పద్మావతి, ప్రతాపరెడ్డి తదితరులు శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీశ్రీ కవిత్వాన్ని చదివి వినిపించారు. ఉపాధ్యాయులు లక్ష్మీకాంతరెడ్డి, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

కర్నూలు సిటీ: ప్రభుత్వ బీఈడీ కాలేజీలో బుధవారం మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి పాల్గొని శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీశ్రీ మహాప్రస్థానం కవిత్వానికే కొత్త దారులు చూపించిందని, కష్టజీవులకు ఇరువైపుల నిలిచిన వాడే కవి అని లోకానికి చాటిందన్నారు. శ్రీశ్రీ ఆలోచనల వెంట అభ్యుదయ భావాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు పార్వతీ దేవి, మధుసూదన్, నాగలక్ష్మీ, గోవిందరాజులు, కళ్యాణ్ కుమార్ ప్రసంగించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కల్లూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ మహబూబ్ బాషా, యూనిక్ ఇంగ్లిష్ స్కూల్ చైర్మన్ డాక్టర్ మౌలాన ఖాజి అబ్దుల్ మాజీద్ అన్నారు. స్థానిక అబ్బాస్ నగర్‌లోని యూనిక్ ఇంగ్లిష్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ మౌలాన ఖాజీ అబ్దుల్ మాజీద్, డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు సోషల్‌స్టడీస్, తెలుగు సబ్జెక్టులలో వంద మార్కులు సాధించారని చైర్మన్ తెలిపారు. తమ విద్యార్థులు తహెసీన్ 581 మార్కులు, సుఫియా 570 మార్కులు, ఫైరోజ్ 560 మార్కులు సాధించారన్నారు. అలాగే 45 శాతం మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు


ఆటో డ్రైవర్లు, కూలీలతో మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి

పాణ్యం:వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి డ్రైవర్లకు సూచించారు. బుధవారం ఆయన కూలీల ఆటోలను నిలిపి డ్రైవర్లను హెచ్చరించారు. పలు ఆటోలకు జరిమానా విధించారు. మరోసారి పరిమితికి మించి ఎక్కిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కిక్కిరిసి ఉన్న ఆటోల్లో ఎక్కి ప్రమాదాల బారిన పడవద్దని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఉన్నారు.

శుభకార్యం

పాణ్యం: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్ కుమార్తె వివాహానికి పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షులు రామలక్ష్మయ్య, పార్టీ మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, చందమామ బాబు, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, ఎల్లగౌడ్, సుబ్రహ్మణ్యం, చిన్న ఎల్లప్పయ్య ఉన్నారు.

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: పవిత్ర వైశాఖ బహుళ తృతీయ 'అక్షయ తృతీయ' పురస్కరించుకొని శరీన్ నగర్‌లోని సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. మహాభిషేకం, పంచామృతాభిషేకం, శ్రీరామచంద్రమూర్తి, శ్రీదేవి భూ దేవి సమేత వేంకటేశ్వర స్వామి పూజా విగ్రహాలకు గంధలేపనంతో అలంకరించి అష్టోత్తర శతనామ పూజ, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు.

వాడీవేడిగా నగర పంచాయతీ సమావేశం

- నగర పంచాయతీ నిధులను అన్న క్యాంటీన్‌కు ఎలా మళ్లిస్తారని నిలదీత

కోడుమూరు రూరల్: గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ రమేష్‌బాబు బుధవారం నిర్వహించిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశాన్ని ఉద్దేశించి వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ మాట్లాడుతూ.. గూడూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వం గతంలోనే నిధులు విడుదల చేసిందని, ప్రస్తుతం అన్న క్యాంటీన్ మరమ్మతులు, నిర్వహణ కోసమంటూ నగర పంచాయతీ జనరల్ నిధులు రూ.5 లక్షల మంజూరుకు ఎలా ప్రతిపాదనలు పంపుతారంటూ కమిషనర్‌ను ప్రశ్నించారు. అలాగే పట్టణంలో మురుగునీటి కాల్వలో పూడికతీత కోసం ఏకంగా ఒకే వ్యక్తికి రూ.16 లక్షలకు పైగా నిధుల కేటాయింపునకు పాలక వర్గం అనుమతులు లేకుండా ప్రతిపాదనలు ఎలా రూపొందిస్తారని, పరిస్థితి చూస్తుంటే అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కైనట్లుగా ఉందంటూ పీఎస్ అస్లామ్ నిలదీశారు. నగర పంచాయతీ పరిధిలో జరిగే ప్రతి పని పాలక వర్గంతో చర్చించి నిర్వహించాలని కౌన్సిలర్లు అధికారులను కోరారు. సమావేశంలో మేనేజర్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు ఖలీల్, కలాం, రత్నమ్మ, పద్మావతి, కో–ఆప్షన్ మెంబర్లు రామాంజనేయులు, మదార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


నిధుల ప్రతిపాదనపై మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్

పనిచేసే చోట నీళ్లు, నీడ కల్పించాలి

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే చోట కూలీలకు అవసరమైన మంచినీళ్లు, నీడ వసతి సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. ఆయన బుధవారం మండలంలోని వర్కూరు, కల్లపరి గ్రామాల్లో ఉపాధి పథకం కింద జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. నిర్దేశించిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేస్తే రోజువారీ వేతనం రూ.300 వరకు అందుతుందని వివరించారు. గ్రామాల్లో కూలీలు ముందుకొస్తే వారందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడం జరుగుతుందన్నారు. సిబ్బంది ఆయా గ్రామాల్లోని కూలీలందరికీ పనులు కల్పించాలని ఏపీఓ సూచించారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా


చిన్నటేకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెలగని సెంట్రల్ లైట్లు

వెలగని విద్యుత్ లైట్లు

కల్లూరు: 44వ జాతీయ రహదారి చిన్నటేకూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఉన్న విద్యుత్ స్తంభాలకు లైట్లు వెలగడం లేదని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు స్పందించి విద్యుత్ లైట్లు వేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.


ఎన్‌సీడీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు ఆదేశించారు. ఆయన బుధవారం కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లె గ్రామంలోని పాఠశాలలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్‌సీడీ సర్వేలో భాగంగా రక్తపోటు, షుగర్, క్యాన్సర్ తదితర వ్యాధి లక్షణాలను గుర్తించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వడదెబ్బకు గురిగాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువగా ద్రవపదార్థాలు, ఉప్పు కలిపిన మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ తీసుకోవాలన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ అనీద్, పీహెచ్ఎన్ హనుమంతమ్మ, నాగమణి, పర్యవేక్షకురాలు రెహనా, మాదమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సంచార చికిత్స కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రఘు

పీఎం సూర్యఘర్ లక్ష్యాలు సాధించాలి

కర్నూలు కల్చరల్: జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం అమలులో పురోగతి సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకం అమలు, పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మోడల్ సోలార్ విలేజ్‌గా గుర్తించిన ఏడు గ్రామాల్లో సోలార్ రూఫ్ టాప్ ఇన్‌స్టాలేషన్‌లో పురోగతి తీసుకురావాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించి సోలార్ రూఫ్ టాప్ ఇన్‌స్టాల్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఎం హామీ కింద పుచ్చకాయలమాడ గ్రామ పంచాయతీని ఎంపిక చేయడం జరిగిందన్నారు. సంబంధిత గ్రామాల్లో రిజిస్ట్రేషన్‌లు మాత్రమే చేస్తున్నారని, వాటిని తదుపరి దశకు తీసుకెళ్లడంలో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. సోలార్ రూఫ్ టాప్ వినియోగంపై గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. సోలార్ ప్యానెల్స్ ఇన్‌స్టాల్‌కు సంబంధించి సబ్సిడీ వస్తుందని వివరించారు. పీఎం కుసుమ్‌కి సంబంధించి మే 8వ తేదీన టెండర్ పనులు పూర్తి కాగానే ఇన్‌స్టాలేషన్‌పై యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, ఈఈ ఓబులేసు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, పాల్గొన్న జిల్లా అధికారులు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

రెడ్‌క్రాస్ సేవలు విస్తరించాలి

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. ఆయన బుధవారం తన క్యాంపు కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచే చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో పిల్లలకు ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్ నేర్పించే చర్యలు తీసుకోవాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, పిడుగులు పడినప్పుడు బాధితులను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని, అనాథ పిల్లలను ఆదుకునే చర్యలు, వారిని ఆదరించే ఏర్పాట్లు చేయాలని, పేద పిల్లలకు అవసరమైన స్కూల్ యూనిఫాంలు, షూస్, నోట్ పుస్తకాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులకు సూచించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి స్కిన్ బ్యాంకు పూర్తి స్థాయిలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తలసీమియా రోగులకు రక్తం, మందుల సరఫరా, బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్‌కు అవసరమైన చర్యలు, జన ఔషధి దుకాణం ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, సెక్రటరీ వెంకటకృష్ణ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ తరపున రక్తదాన శిబిరాలు, కంటి శుక్లాలు, ఆర్గాన్ డొనేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావు, డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

గోనెగండ్ల: చిన్ననేలటూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు. సమాచారం మేరకు బుధవారం సాయంత్రం పోలీసులు చిన్న నేలటూర్ గ్రామంలో ఈడిగ నరసింహుడు ఇంటిలో తనిఖీ చేయగా.. 36 మద్యం బాటిళ్లు లభించడంతో కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైన అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైన మద్యం అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

ఆటో డ్రైవర్‌కు జైలుశిక్ష

ఆదోని రూరల్: మద్యం సేవించి ఆటో నడిపిన కల్లుబావికి చెందిన గొల్ల వీరేష్‌కు నెల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 22వ తేదీన డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన వీరేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. విచారించిన న్యాయమూర్తి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు.